21న బహిరంగ వేలం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో వివిధ అవసరాలను తీర్చేందుకు అవసరమైన వస్తువులను ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు కం వేలం పాట ఈ నెల 21న నిర్వహిస్తున్నట్టు ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కొబ్బరి చెక్కలు ఏడాది కాలం పాటు తీసుకునేందుకు వేలం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రొవిజన్స్ ఈ-ప్రోక్యూర్మెంట్ ఆరు నెలల పాటు సరఫరా చేసేందుకు ఔత్సాహిక వ్యాపారుల నుంచి వేలం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అలాగే 4 గంటకు తలనీలాలు ఏడాది పాటు తీసుకునేందుకు వేలం నిర్వహిస్తారన్నారు. అలాగే స్వామివారి చిత్రపటాలను, ఏడాది పాటు పంచెలు, చీరలు, కండువాలు (సాదా కండువాలు, బొమ్మల కండువాలు, సిల్క్ రకం కండువాలు), రవికలు అవసరమైన ఇతర వస్త్రాలను ఏడాది పాటు సరఫరా చేసేందుకు శుక్రవారం బిడ్లు తెలుస్తున్నట్టు తెలిపారు. ఔత్సాహిక వ్యాపార వేత్తలు ఆలయ నిబంధనలకు కట్టుబడి వేలం పాటలో పాల్గొన వచ్చన్నారు.

పలాస : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కోటబొమ్మాళి : మాట్లాడుతున్న టిడిపి నాయకులు

సమస్యలు పరిష్కరించే వరకు తగ్గేదేలే

ఐదో రోజుకు చేరిన అంగన్వాడీల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే వరకూ తగ్గేదేలేదని అంగన్వాడీ కార్యకర్తలు స్పష్టం చేశారు. కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి ఐదో రోజుకు చేరుకుంది. సమ్మెకు పలు టిడిపి, పలు పార్టీలు, ఉద్యోగ, ప్రజా సంఘాల నుంచి మద్దతు పెరుగుతోంది. కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని వినూత్న నిరసన తెలిపారు. మరికొన్నిచోట్ల ర్యాలీలు చేపట్టారు. అలాగే పొందూరులో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టించడం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఇచ్ఛాపురంలో చేపట్టిన నిరవధిక సమ్మెకు ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, హైమవతి, విజయలక్ష్మి, జయ, టిడిపి నాయకులు కాళ్ల జయదేవ్, నందిక జాని, కొండ శంకర్‌రెడ్డి, ఢిల్లీరావు, కాళ్ల దిలీప్‌కుమార్, పి.తవిటయ్య, మహదేవ్‌రెడ్డి, ఆర్.జానకిరావు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మె విచ్ఛిన్నానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు ఆపి సిఎం జగన్ ఇచ్చిన హామీ నెరవేర్చాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఎచ్చెర్లలో అంగన్వాడీలు నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు.

శ్రీకాకుళం నగరంలోని తోటవీధి, గార ఐసిడిఎ ప్రాజెక్టుల వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెకు టిడిపి నాయకులు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, పార్టీ నాయకులు రెడ్డిశంకర్, బొల్ల నాగేంద్ర యాదవ్, ఎఎంసి మాజీ చైర్మన్ మూకల్ల శ్రీను, సానివాడ సర్పంచ్ రుప్ప రమణమూర్తి పాల్గొన్నారు.

నరసన్నపేటలో చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా స్థానిక వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. అనంతరం నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన ర్యాలీ చేపట్టి ప్రభుత్వ మొండి వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ సహాయ కార్యదర్శి శిరీష, అధ్యక్షులు డి.సరోజిని, ప్రధాన కార్యదర్శి పట్ట భాగ్యలక్ష్మి, సిఐటియు సీనియర్ నాయకులు ఆర్.సురేష్ బాబు, పోలాకి మండల కమిటీ కన్వీనర్ కాల నర్సింహులు పాల్గొన్నారు.

బూర్జలోని చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా కళ్లకు నల్లరిబ్బన్లతో గంతలు కట్టి వినూత్నంగా నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి అల్లు సత్యనారాయణ, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, రాధిక, సంతోషి, లక్ష్మి, సరస్వతి, శారద, రాజశ్రీ, రమణమ్మ, కళాశతి పాల్గొన్నారు.

పొందూరు : స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్యకర్తలు

ఇచ్ఛాపురం : సమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

టెక్కలిలో అంగన్వాడీ కేంద్రాలపై సచివాలయం సిబ్బందితో చేపడుతున్న పనులను నిలుపుదల చేయాలని కార్యకర్తలు తహశీల్దార్ ప్రవల్లికాప్రియను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు నంబూరు షణ్ముఖరావు, కుప్పిలి కామేశ్వరరావు, ఎసిసిటియు నాయకులు శ్రీను, ప్రాజెక్టు నాయకులు ఆర్.ఆదిలక్ష్మి, సిహెచ్.ఇందుమతి, వాణిశ్రీ, శ్రీదేవి, శ్యామల, ప్రభ, అరుణ, ఉష, కె.అన్నపూర్ణ, మల్లేశ్వరి, కృష్ణవేణి, పద్మావతి, వనజాక్షి పాల్గొన్నారు.

ఆమదాలవలస ఐసిడిఎస్ ప్రాజెక్టు చేపట్టిన అంగన్వాడీ కార్యకర్తల నిరవధిక సమ్మెలో అంగన్వాడీ జిల్లా మెంబర్ పంచాది లతాదేవి, యూనియన్ నాయకులు పి.భూలక్ష్మి పి.లక్ష్మి, కనకం అరుణకుమారి పాల్గొన్నారు. ముందుగా ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

పలాసలో నిరవధిక సమ్మెలో భాగంగా ఎస్ఆర్ షాపింగ్ మాల్, కెటి రోడ్డు, శ్రీనివాస లాడ్జి, డిగ్రీ కళాశాల రోడ్డు, ఎంపిడిఒ కార్యాలయం మీదుగా ఐసిడిఎస్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ధర్నాకు, సమ్మెకు జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, పుక్కల గురయ్య, బైపల్లి రామకృష్ణ, ఎపి ఎన్‌జిఒ సంఘం నాయకులు బోనెల గోపాల్, బి.ఓంకార్, శ్రీనివాసరావు, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ, కృష్ణవేణి, ఎఐసిసిటియు నాయకులు దున్న శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో నిరవధిక సమ్మెలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు పాతపట్నం మెయిన్ రోడ్డులో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, పాతపట్నం ప్రాజెక్టు నాయకులు బి.శాంతామణి, యు.ఉషారాణి, డి.లలిత, కె.నారాయణమ్మ, కె.సావిత్రి, పి.కళావతి పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో చేపట్టిన నిరవధిక సమ్మెకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల టిడిపి అధ్యక్షుడు బోయిన రమేష్, జనసేన నాయకులు పల్లి కోటేశ్వరరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుయువత మహిళా అధ్యక్షులు పూజారి శైలజ, మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు పాల్గొన్నారు. ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో కేంద్రాలు తాళాలు పగలుగొట్టి కేంద్రాలు తెరిపించడం వల్ల అధికారులే ఇళ్లకు పోతారని సిఐటియు జిల్లా నాయకులు హనుమంతు ఈశ్వరరావు హెచ్చరించారు. కోటబొమ్మాళి అంగన్వాడీ నిరసన శిబిరంలో పాల్గొని మాట్లాడారు.

పొందూరు మండలంలోని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పర్యటనకు వచ్చారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యాన కార్యకర్తలు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం అంగన్వాడీల సెంటర్ల తాళాలు బద్దలు కొట్టించడం సరైంది కాదని తెలిపారు. ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనాలతో జీవనం గడపడం కష్టంగా ఉంది.అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు వివిధ రకాల యాప్‌లు తెచ్చారని, ఫోన్లు పని చేయడం లేదని, ఎటువంటి శిక్షణా ఇవ్వలేదని అన్నారు. ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో నెట్ సిగ్నల్ ఉండటం లేదని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల అంగన్వాడీలు మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంగన్వాడీ యూనియన్ నాయుకులు జ్యోతి, లక్ష్మి, కృష్ణవేణి, రమ, లక్ష్మి పాల్గొన్నారు.

అలాగే మండలంలోని బురిడికంచరాం, లోలుగు గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లోని సరుకులను స్టాక్‌ను ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్ లీలారాణి, సచివాలయం సిబ్బంది పరిశీలించారు.

కవిటి సచివాలయం -1, కె.కంద్రవీధిలోని అంగన్వాడీ కేంద్రాలల్లోని స్టాక్‌ను ఇఒ వీరభద్రస్వామి, విఆర్‌ఒలు నారాయణ, ప్రశాంతి, అంగన్వాడీ సూపర్ వైజర్లు పల్లవి, లక్ష్మి, వాలంటీర్లు పరిశీలించారు.

మెళియాపుట్టి : సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీలు

శ్రీకాకుళం : నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

పొందూరు ఖాదీ అభ్యున్నతికి కృషి

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు కలిగిన పొందూరు సన్నఖాదీ అభ్యున్నతికి, అభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పొందూరు పట్టణంలో ఎఎఫ్‌కెకె సంఘం ఆధ్వర్యాన నిర్మించిన వాణిజ్య దుకాణా సముదాయాన్ని శనివారం ప్రారంభించారు. ముందుగా ఖాదీ నిలయంలోని మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలకు ఆదర్శంగా నిలుస్తున్న ఖాధీ వస్త్రాలను ప్రతిఒక్కరూ ధరించాలని కోరారు. ముఖ్యంగా యువత ఖాధీ వస్త్రాల వినియోగంపై మక్కువ చూపాలని అన్నారు. పొందూరులో చేనేత క్లష్టర్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. పొందూరు ఖాధీని ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే డాక్టర్ వైఎస్ఆర్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును ముఖ్యమంత్రి జటన్ ప్రకటించి రూ.10 లక్షలు ప్రోత్సాహకాన్ని అందజేశారని పేర్కొన్నారు. ఎఫ్‌కెకె సంఘం ఈ రూ.10 లక్షలతో వాణిజ్య దుకాణాల సముదాయాన్ని నిర్మించడం ఆనందించదగ్గ విషయమని చెప్పారు.

కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, ఎంపిపి ప్రతినిది కిల్లి నాగేశ్వరరావు, ఎఫ్‌కెకె సంఘం అధ్యక్ష, కార్యదర్శిలు కామేశ్వరప్రసాద్, వెంకటరమణ, వైసిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి బండారు జైప్రతాప్‌కుమార్, ఎంపిటిసి పద్మావతి, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు గాడు నాగరాజు, కిల్లాన సూర్యారావు, రమణమ్మ, అన్నాజీరావు, గూనాన కృష్ణ పాల్గొన్నారు.

ఎస్‌పికి డిజిపి డిస్క్ అవార్డు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతల విభాగంలో-2022లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్ నుంచి అడిషనల్ డిజిస్థాయి అధికారులకు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి శనివారం డిజిపి ప్రధాన పోలీస్ కార్యాలయం మంగళగిరిలో డిజిపి డిస్క్ అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లా ఎస్‌పి జి.ఆర్ రాధిక జిల్లాలోను క్షేత్రస్థాయిలో శాంతిభద్రతల విభాగంతో పాటు దిశ, కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అందుకు గాను అందించిన సేవలను గుర్తించిన డిజిపి డిజిపి డిస్క్ అవార్డును అందజేసి అభినందించారు. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వారిచే అవార్డును అందుకోవడం చాలా సంతృప్తికరంగా అంశమని, ఈ అవార్డును నేను అందుకోవడం ద్వారా జిల్లా పోలీస్ శాఖ మరింత ఉత్సాహంగా ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి దోహదపడుతుందని ఎస్‌పి రాధిక పేర్కొన్నారు.

అవార్డును అందుకుంటున్న ఎస్‌పి రాధిక

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ పేర్కొన్నారు. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన 1,2,4,7వ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలుకు తీసుకుంటున్న చర్యలను పౌర సరఫరాలశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిల్లర్లు తడిసిన ధాన్యం కొనుగోళ్లలో తేమ శాతాన్ని ఎక్కువగా తీస్తున్నారని పలువురు సభ్యులు ప్రస్తావించారు. నిర్దేశించిన ప్రకారం ఆరబెట్టుకునే సౌకర్యం రైతులకు ఉండక తేమ శాతం ఉంటోందని, కష్టసమయంలో రైతాంగానికి మిల్లర్లు సైతం సహకరించాలని ఆమె సూచించారు. ఉద్దానం ప్రాంత ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చడమే కాకుండా కిడ్నీ వ్యాధిగ్రస్థులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి తోడ్పాటు అందించారని సమావేశంలో ప్రస్తావించారు. ఆర్‌డబ్ల్యుఎస్‌శాఖపై చర్చ కొనసాగిస్తూ సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కిడ్నీ రోగులకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందించడంలో జరిగిన కృషిని ప్రస్తావించారు. అనంతరం గృహ నిర్మాణ శాఖ, సహకారశాఖ, డిసిసిబి, చేనేత, జౌళీశాఖ, ఖాదీ, గ్రామీణ పరిశ్రమలశాఖ, జిల్లా పంచాయతీ శాఖ, జిల్లా నీటి యాజమాన్యశాఖ, పరిశ్రమలశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖలపై చర్చించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టి ప్రజలకు అందించాలని అధికారులకు ఆదేశించారు. 6వ స్థాయీ సంఘం జిల్లా ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు సిరిపురపు జగన్మోహనరావు అధ్యక్షత వహించారు. వివిధ సంక్షేమశాఖల్లో అమలవుతున్న పథకాలపై చర్చించారు. అలాగే 3వ స్థాయీ సంఘ సమావేశానికి జిల్లా ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు పాలిన శ్రావణి అధ్యక్షత వహించారు. సమావేశంలో పశు సంవర్ధకశాఖ, మార్కెటింగ్, వ్యవసాయశాఖ, మత్స్యశాఖ, పట్టు పరిశ్రమలశాఖ, అటవీశాఖ ఉద్యానశాఖలపై సమీక్షించారు. 5వ స్థాయీ సంఘ సమావేశానికి వీరఘట్టం జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి అధ్యక్షత వహించారు. సమావేశాల్లో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా అధికారులుపాల్గొన్నారు.

2013 చట్టాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వంశధార నిర్వాసితులకు చట్టబద్ధంగా రావాల్సిన 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాపు సింహాచలం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వంశధార నిర్వాసితుల పోరాట ఫలితంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పలాస పర్యటనకు వచ్చిన సందర్భంగా రూ.43 కోట్లు నిర్వాసితులు ఖాతాల్లో జమ చేయడాన్ని అభినందిస్తున్నామని అన్నారు. కానీ, యూత్ ప్యాకేజీలు, అదనపు ప్యాకేజీలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరైంది కాదన్నారు. జగన్ ప్రతిపక్ష నాయకునిగా ఉన్నప్పుడు నిర్వాసితుల పోరాటానికి మద్దతు తెలియ జేస్తూ ఇచ్చినహామీ 2013 భూసేకరణ చట్టం అమలు విర్తంజేయాలన్నారు. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు చట్టబద్ధంగా 2013 భూ సేకరణ చట్టం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. భూములిచ్చి సర్వం త్యాగం చేశారని గుర్తు చేశారు. 2013 భూ సేకరణ చట్టం సాధన కోసం నిర్వాసితులంతా ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



సింహాచలం

రక్షణ చట్టంపై అవగాహన అవసరం

వినియోగదారుల కమిషన్ సభ్యులు రాధారాణి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన అవసరమని, తద్వారా సత్వర న్యాయం పొందవచ్చునని వినియోగదారుల జిల్లా కమిషన్ సభ్యులు జి.రాధారాణి పేర్కొన్నారు. ఎచ్చెర్లలోని అంబేద్కర్ గురుకులంలో ప్రిన్సిపాల్ బి.లక్ష్మి అధ్యక్షతన ఆశ్రా (అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్నెస్) సంస్థ జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే అవగాహన కలిగి ఉంటే పిల్లలు ఉత్తమ స్థాయి వినియోగదారులు అవుతారని అన్నారు. తద్వారా దేశ సంపదను పెంచగలుగుతారని అన్నారు. వారిద్వారా స్వచ్ఛమైన ఆర్థిక సమాజం ఏర్పడు తుందని, వారి తల్లిదండ్రులు, చుట్టూ ఉన్న సమాజమూ ప్రభావితం అవుతుందని పేర్కొన్నా రు. తమ హక్కులు ఎలా వినియోగించుకోవాలో కూడా వివరించారు. వినియోగదారులకు హక్కులతో పాటు బాధ్యతలూ ఉంటాయని, వాటిని సక్రమంగా పాటించాలని అన్నారు. సీనియర్ న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్ వినియోగదారుల చట్టం 2019గురించి వివరించారు. అనంతరం నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆశ్రా జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంజి ఎజ్రా, సభ్యులు లఖినాన రవికుమార్, కట్టా. పార్థసారథి, ఉపాధ్యాయులు జ్యోతిశ్రీ, యశోద, ప్రతిభ, ఉమాగౌరీ, ఉదయిని, భ్రమరాంబ తదిరులు పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న రాధారాణి

సర్వేల్లో అభ్యర్థుల భవిష్యత్

ఎన్నికల సమయానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికపై మల్లగుల్లాలు పడుతూ కసరత్తు వేగవంతం చేశాయి. అభ్యర్థుల ఎంపికల్లోనూ వ్యూహప్రతివ్యూహాలు చేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో సామాజిక అంశం కీలకపాత్ర వహించనున్నట్లు పరిణామాలు చెబుతున్నాయి. అభ్యర్థుల ఎంపికకు సంబంధించి జిల్లాలో వైసిపి, టిడిపి ముమ్మరంగా సర్వేల్లో నిమగ్నమైనట్లు తెలుస్తుంది. జిల్లాలో అధికార వైసిపి ఐప్యాక్ సర్వేలతో పాటు పార్టీ నేతల బృందాలతోనూ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. ప్రశాంత కిషోర్ వ్యూహకర్తగా చేస్తున్న సర్వే బృందాలకు అదనంగా అధికార పార్టీ మరో కొత్త సర్వే సంస్థ జిల్లాలో పనిచేస్తున్నట్టు అంత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఈ సంస్థ కేంద్ర కార్యాలయం కోల్‌కత్తాలో ఉందని తెలిసింది. ఆ సర్వే సంస్థ పేరు ఇప్పటికీ బయటపడలేదు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ బృందాలుగా విడబడి ప్రజాభిప్రాయాన్ని, నేతల అభిప్రాయాన్ని తీసుకుంటున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో ఇప్పటికే నియోజకవర్గాల్లో 11 మంది ఇన్‌ఛార్జిలను కొత్తగా నియమించడంతో ఈ సర్వేల ఆధారంగా జిల్లాలో కనీసం రెండు, మూడు నియోజకవర్గాల్లో ఇప్పుడున్న ప్రచారంలో కొత్త అభ్యర్థులు తెరపైకి వచ్చే అవకాశం ఉందని ఆ పార్టీ సీనియర్లు భావిస్తున్నారు. జిల్లాలో పార్లమెంట్ అభ్యర్థి ఎంపికలో పార్టీ తీవ్రంగా కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే తెరపైకి వచ్చిన పేర్లు మళ్లీ తెరచాటుకు పోతున్నాయి. జిల్లాలో ముఖ్యనేతలిద్దరూ తమ ప్రయోజనాల కోసం కొత్త అభ్యర్థులను తెరపైకి తెచ్చి అధినేత ముందు ప్రతిపాదించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇందులో వారసత్వ రాజకీయాలు కీలకపాత్ర పోషిస్తున్నట్టు తెలిసింది. జిల్లాలో ఇచ్ఛాపురం నియోజకవర్గం అభ్యర్థి ఎంపిక చుట్టూ జిల్లా రాజకీయాలు తిరుగుతున్నట్లు తెలిసింది. వెంకటరెడ్డి రెడ్డి పేరును జిల్లా ముఖ్యనేత ఒకరు అధినేత ముందు గుంటూరు పర్యటన సమయంలో హాజరుపర్చి టిక్కెట్ ఇస్తే మంచిదని సూచించినట్లు తెలిసింది. ఆయనకు టిక్కెట్ ఇస్తే పిరియా సాయిరాజ్ కుటుంబ పరిస్థితి ఏమిటని జగన్ ప్రశ్నించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వారికి పార్లమెంట్ టిక్కెట్ ఇస్తే సరిపోతుందని అన్నట్లు ప్రచారంలో ఉంది. తద్వారా ఒక దెబ్బకు రెండు పిట్టల నానుడి ఆచరణలోకి వచ్చిటన్లు అవుతుందని ఆ నేత భావించినట్టు కనిపిస్తుంది. అయితే వెంకటరెడ్డి స్థానికేతరుడన్న మాట ఆ పార్టీ కార్యకర్తల్లో వినిపిస్తుంది. ఆ ప్రాంతంలోని మరో కార్పొరేషన్ చైర్మన్ కూడా టిక్కెట్ ఆశిస్తున్నట్టు ప్రచారంలో ఉంది. జిల్లాలోని మరో ముఖ్య నేత ఆ నియోజకవర్గంలో ఇప్పటికే స్థానిక సంస్థల్లో పదవి చేపట్టినా మరో మహిళా నాయకురాలుకు టిక్కెట్ ఇస్తే మంచిదని అధినేతకు సూచించినట్టు తెలిసింది. ఆ నియోజకవర్గంలో ఈసారి రెడ్డిక సామాజిక వర్గానికి టిక్కెట్ ఇవ్వాలన్న ప్రచారం ఉన్నా.. ఆ స్థాయి నాయకులు ఎవరున్నార్న ప్రశ్న ఆ పార్టీలో వినిపిస్తుంది. నర్తు రామారావుకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టి నియోజకవర్గంలో అసమ్మతి రాగం వినిపించకుండా చేయాలనుకున్న అధినేతకు ఇప్పుడు పెద్ద సవాల్‌గా మారినట్టు కనిపిస్తుంది. అభ్యర్థి ఎంపికలో నేతల మద్దతు లేకుండా ఆ నియోజకవర్గంలో మళ్లీ కొత్త గ్రూపులు తలెత్తే అవకాశం ఉందని పార్టీ సీనియర్లు భావిస్తున్నట్లు తెలిసింది. టెక్కలి నియోజకవర్గంలో గ్రూపుల గోల మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. ఇచ్ఛాపురం అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న వెంకటరెడ్డి టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్తగా పనిచేస్తున్నారు. సిఎం జిల్లాకు వచ్చి వెళ్లిన వెంటనే టెక్కలిలో నియోజకవర్గ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఆ సమావేశానికి దువ్వాడ దంపతులు తప్ప మరెవ్వరూ హాజరు కాలేదని తెలిసింది. అక్కడ అధినేత అభ్యర్థిగా ప్రకటించిన ఆయన తన భార్య ఇన్‌ఛార్జిగా ఉంటారని ప్రకటించారు. జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే... ఇప్పటి ఇన్‌ఛార్జి అభ్యర్థి అయ్యే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. పలాస, పాతపట్నం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో అసమ్మతి రాగం ఆరున్నరొకటి ఆలాపనతో వినిపిస్తుంది.

ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి పరిస్థితి అందుకు భిన్నంగా లేదు. గ్రూపుల పోరు, ఆధిపత్య పోరు నిత్యమూ బహిర్గమవుతుంది. టిడిపి రాష్ట్ర నేత, జిల్లాలో పార్టీ నేతల దృష్టిలో పెట్టకుండా కనీసం జిల్లా అధ్యక్షులకు తెలియుండా టిడిపి సర్పంచ్‌ల సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఆ పంచాయతీ నేతలతో కలిసి సమావేశ రూపకల్పన చేసినట్లు తెలిసింది. సమావేశం నిర్వహించనున్నట్లు పత్రికల్లో వార్తలొచ్చాయి. దీంతో ముఖ్య నేతలు విస్తుపోయారు. దీంతో పార్టీలో చర్చ జరిగినట్లు తెలిసింది. దీంతో ఆ సమావేశాన్ని అర్ధాంతరంగా రద్దు చేసుకున్నట్లు తెలిసింది. లోకేష్ యువగళం యాత్ర విశాఖపట్నం వరకు మాత్రమేనని నిర్ణయంతో జిల్లా నేతలు ఊపిరిపీల్చుకున్నట్లు తెలిసింది. జనసమీకరణ సమస్య, డబ్బులతో కూడుకున్నదని ఇప్పటి వరకు అభ్యర్థుల ఎంపిక అయోమయంగా నేతలు భావిస్తున్నారు. ఇచ్ఛాపురం, టెక్కలితో పాటు ఆమదాలవలస నియోజకవర్గం అభ్యర్థిగా కూన రవికుమార్ పేరు తొలి జాబితాలో రానున్నాయని తెలిసింది. వైసిపి మాదిరిగా టిడిపి కూడా వ్యూహకర్త రాబిన్‌శర్మ బృందాలు జిల్లాలో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఇతర సంస్థ కూడా మరొకటి పనిచేస్తున్నట్లు సమాచారం. పార్టీ నియమించిన కమిటీ సభ్యులు కూడా జిల్లాలోని నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఎవరైతే బాగుంటుంది సర్వేతో పార్టీ అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు తెలిసింది. ఏ రెండు, ఏ మూడు కమిటీలు ఒకే అభ్యర్థిని సూచిస్తే వారికే టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉందని పార్టీ నేతలు చెబుతున్నారు. ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాల ఆశావహులు కొందరు జనసేన పార్టీ పొత్తు భయపెడుతున్నట్లు తెలిసింది. పొత్తులో భాగంగా ఆ స్థానం జనసేనకు ఇస్తే తమ పరిస్థితి ఏమిటని వారు ఆందోళన చెందుతున్నారని తెలిసింది. జిల్లాలో పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో పార్టీ విస్తృత సమావేశం జరుగుతుంది. ఆ సమావేశానికి అధినేత చంద్రబాబు రానున్నారని ప్రచారం జరిగినా ఆ సమావేశం తేదీ ఖరారైన తరువాత కూడా రద్దయింది. అందుకు కారణాలను మాత్రం తెలుగుదేశం నేతలెవరూ చెప్పే పరిస్థితి లేదని తెలిసింది. ప్రధాన పార్టీలకు ముఖ్యంగా నేతలకు, కార్యకర్తలకు ప్రజల్లో సంబంధాలు బాగా తగ్గిపోయాయి. ఏదైఏమైనా ఎంపిక చేసి టిక్కెట్లు ఇచ్చిన తరువాత ప్రజాభిప్రాయం మారకుండా స్థిరంగా ఉంటుందని చెప్పే పరిస్థితి ఉండదన్నది నడుస్తున్న చరిత్ర చెబుతుంది.

- సత్తారు భాస్కరరావు

IN THE HON'BLE COURT OF THE SENIOR CIVIL JUDGE, SOMPETA.
E.P.10/2019 in O.S.24/2006

Between:
P. Venkata Rao. --D.Hr.
And:
Chakradhara Sahu And others. --J.Drs.

NOTICE
Under Order-21, Rule-64 C.P.C.

1. **Chakradhara Sahu,** s/o late Guna Sahu, resident of Dolaiputtuga village, P.O: Talatampara, Kanchili Mandal, Srikakulam Dist.
2. **Ratnakara Sahu,** s/o late Gunna Sahu,
--rest-do--

Please take notice that the D.Hr. herein filed the above E.P. against you all for realisation of E.P. amount and it stands posted to appearancel of both of you on **21-12-2023 at about 10-30 A.M.** in the above court, you appear either in person or through your Advocate on that day, failsing which the matter will be decided as per law.

K.S.PRASAD BABU,
Advocate,
Sompeta.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి వసంతరెడ్డి

సాదాసీదాగా మండల సమావేశం

అనధికార సభ్యులదే హవా

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ప్రేమలీల, ఎంపిపి మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కూడా పలు శాఖలపై జరిగిన చర్చలో ఎప్పటిలాగే ప్రజా ప్రతినిధుల కుటుంబసభ్యుల హవానే కొనసాగింది. సభ్యులు కానివారే అధికారులను ప్రశ్నలు సంధించడంతో అధికారులు అసహనం వ్యక్తం చేశారు. గృహనిర్మాణ శాఖపై జరిగిన చర్చలో ఇళ్ల బిల్లులు చెల్లించకపోవడంపై హౌసింగ్ ఎఇపై నౌపడ ఎంపిటిసి సుధాకర్ ప్రశ్నించారు. సిమెంట్, ఇసుక ఇచ్చి బిల్లులు ఎందుకు చెల్లించడం లేదో ఎఇ నర్సింగరావు సమాధానం ఇవ్వాలని కోరారు. పంచాయతీరాజ్‌పై జరిగిన చర్చలో మండలంలో సచివాలయాలు, రైతు భరోసా, వెల్నెస్ సెంటర్ల కొరకు 56 భవనాలు మంజూరయ్యాయని, ఇందులో 17 భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని పంచాయతీరాజ్ జెఇ విష్ణుప్రియ తెలిపారు. గ్రామీణ త్రాగునీటి సరఫరా శాఖపై జరిగిన చర్చలో సంతబొమ్మాళి గ్రామంలో వెలమవీధి, దమ్మల వీధిలో ఏర్పాటుచేసిన ఇంటింటి కొళాయిలకు తాగునీరు రావడంలేదని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షుడు కెళ్లి జగన్నాయకులు, వైస్ ఎంపిపి నక్క చింతామణి ఉన్నారు.

సిఎంకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ ఎఱ్ఱా

ఒబిసి హోదాకు సిఎం హామీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కేవటి కులస్తులను ఓబిసిలో చేర్పించి హోదా వచ్చేలా కృషి చేస్తానని సిఎం జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని నువ్వలరేవు సర్పంచ్ మువ్వల ఎఱ్ఱా తెలిపారు. శనివారం నువ్వలరేవు సచివాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల పలాసలో సిఎంను కలిసి వినతిపత్రం అందించినట్టు తెలిపారు. ఎన్నో తరాలుగా ప్రభుత్వపరంగా కుల గుర్తింపు నోచుకోకపోవడంతో బాగా వెనుక బడిపోయామని విషయం సిఎం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో కేవటి కులాన్ని మత్స్యకార కులంగా గుర్తించి బిసి-ఎ హోదాను ప్రభుత్వం కల్పించిందన్నారు. సుమారు పదకొండేళ్ల గడచిన తమకులానికి ఒబిసి హోదా రాలేదని ఆయన సిఎం వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తమ కులస్తులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు దూరమవుతున్నారని, ఎలాగైనా తమకు ఒబిసి హోదా ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని సిఎంను కోరినట్టు తెలిపారు. తమ విజ్ఞప్తిపై సిఎం సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఆయనతో పాటు వైస్ సర్పంచ్ దేవా, ఎంపిటిసి బైనపల్లి త్రినాధ్ బెహరా, రామకృష్ణ, సొసైటీ ప్రెసిడెంట్ నీలాంబర్ బెహరా, దోయి బెహరా, త్రినాధ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

ప్రజాశక్తి- పలాస

విద్యార్థి సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.రవి అన్నారు. శనివారం ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ రవి ఆధ్వర్యంలో పలాస మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన విద్య విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిఒ నెంబర్ 117 రద్దుచేసి 3,4,5 తరగతులను విలీనం విరమించుకోవాలని కోరారు. పలాస మండలంలో ఉన్న హస్టళ్లలో మౌలిక సదుపాయాలు కరువై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. లేకపోతే ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం ముందు విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు సాయి, మండల కార్యదర్శిగా కుప్ప సూర్య, ఉపాధ్యక్షులు ధను, జీవన్ జస్వంత్ పాల్గొన్నారు.

నియామకపు పత్రాన్ని అందజేస్తున్న విజయ

సీనియర్ సహాయకులకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలో పనిచేస్తున్న పలువురు సీనియర్ సహాయకులకు పరిపాలనాధికారులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ జెడ్‌పి సిఇఒ వెంకట్రామన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ శనివారం అందజేశారు. ఇచ్ఛాపురం పిఆర్ఐ సబ్ డివిజన్, సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న జ్యోతిలక్ష్మి పాణిగ్రాహి, రణస్థలం ఆర్‌డబ్ల్యుఎస్ అండ్ ఎస్ సబ్‌డివిజన్ సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న ఎల్.నాగేశ్వరరావులకు పరిపాలనాధికారులుగా డ్వామాలో నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బూర్జ మండలం గుత్తావల్లి జెడ్‌పి హైస్కూల్ రికార్డు అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు కుమారుడు ఎస్.రాజేష్‌కు టైపిస్టుగా కవిటి మండల పరిషత్ కార్యాలయంలో నియమిస్తూ నియామకపు పత్రాలను అందజేశారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులు చదువుకుంటున్నప్పుడే సాఫ్ట్‌స్కిల్స్‌పై అవగాహన పెంచుకుని వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. కళాశాలలో స్కిల్ ప్రోగ్రాంను శనివారం నిర్వహించారు. విద్యార్థులు వారి విద్యార్థి దశను విజయవంతంగా అధిగమిస్తే భవిష్యత్‌లో ఏ రంగంలోనైనా రాణించగలరన్నారు. వారం రోజులుగా ప్రభుత్వ మహిళా కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ విభాగం సంయుక్తంగా స్టూడెంట్స్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సహకారంతో సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంప్లాయిబిలిటీ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్‌ను నాంది ఫౌండేషన్, మహేంద్ర ప్రైడ్ క్లాస్ ప్రోగ్రాం ట్రైనర్స్, ఎ.గీత, వై.హరికుమార్, ఎన్.జీవన్ కుమార్ 167 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జి.సుమలత, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్‌నారాయణ, ఐక్యుఎసి కోఆర్డినేటర్ ఎస్-పద్మావతి, అకాడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు, జెకెసి కో-ఆర్డినేటర్ ఐ.లక్ష్మి, స్కిల్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ ఎస్.వాణీకుమారి, ఎస్.మాధవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

కవిటి : ప్రదర్శనలు వివరిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- కవిటి

మండలం బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు 65 ప్రదర్శనలు ఇచ్చారు. వీటిలో గ్రూప్ విభాగంలో రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అబినేష్, రామ్ చరణ్ రూపొందించిన సెన్సార్ బేస్డ్ రైల్వే ప్రాజెక్ట్ ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాస్థాయి ప్రదర్శనకు ఎంపికవ్వగా, వ్యక్తిగత విభాగంలో బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఆర్.జీవన్ కుమార్ రూపొందించిన హైడ్రాలిక్ ట్రాఫిక్ రిడక్షన్ సిస్టం ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామకృష్ణ తెలిపారు. కుసుంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన యాసిడ్ రైన్ ద్వితీయ స్థానంలో నిలవగా, వ్యక్తిగత విభాగంలో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి రూపొందించిన మిల్లెట్స్ ఫర్ హెల్దీ లైఫ్ ప్రదర్శన ద్వితీయస్థానం దక్కించుకుంది. ఉపాధ్యాయ విభాగంలో ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎం మురళీ కృష్ణ రూపొందించిన డయాబెటిస్ - కంట్రోల్ ప్రాజెక్ట్ జిల్లాస్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. విజేతలకు ఎంపిటిసి డి.సతీష్ కుమార్, విద్యా కమిటీ చైర్మన్ బొనమాలి మజ్జి బహుమతులు అందజేశారు.

జి సిగడాం : విద్యార్థులు శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి చెందాలని ఎంఇఒ అరసాడ రవి అన్నారు. జి.సిగడాం ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి రాహుల్, ఆదర్శ పాఠశాలకు చెందిన ఉదయ్ కుమార్, జ్యోతి కుమార్‌లు మండలస్థాయి విజేతలుగా ఎన్నికైనట్లు ఎంఇఒ తెలిపారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ లంక అన్నా శామ్యూల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: విద్యార్థులు సృజనాత్మకతను అలవర్చుకోవాలని ఎంఇఒ గెడ్డాపు రాజేంద్రప్రసాద్ అన్నారు.

జి.సిగడాం : ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎంఇఒ రవి

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌కు 66 ప్రాజెక్టులు వచ్చాయి. జిల్లాస్థాయికి మూడు ప్రాజెక్టులను ఎంపిక చేశారు. గ్రూపు విభాగం నుండి ప్రభుత్వం ఉన్నత పాఠశాల విద్యార్థి ఎన్.సాయి గణేష్, బి. దిలీప్, వ్యక్తిగత విభాగం నుంచి జిల్లా పరిషత్ హై స్కూల్ తొగరాం నుంచి చరణ్ తేజ, టీచర్ విభాగం నుంచి మున్సిపల్ హైస్కూల్ చింతాడ నుంచి హేమంత్ సాయి ప్రాజెక్టులు సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శనలో ఎంపిక కాబడ్డాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.ఎ.రాములు, సిఎంఒ జిల్లా సమగ్ర శిక్షణా పరిశీలకులుగా పేడాడ ప్రభాకరరావు, పలు పాఠశాలల సైన్సు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి- బూర్జ

రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. శనివారం మండలంలో డొంకలపర్త గ్రామంలో రూ.21 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాన్ని ప్రారంభించి మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. రైతులకు రైతు భరోసా పథకాన్ని అమలు చేసిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పనులు ప్రారంభం నుంచి ధాన్యం పండించి, కొనుగోలు చేసేంతవరకు ప్రభుత్వమే బాధ్యత వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి రామారావు, టిట్కో డైరెక్టర్ గోవిందరావు, వైస్ ఎంపిపి సూర్యారావు, డిసిఎంఎస్ సభ్యులు జల్లు బలరాం నాయుడు, సర్పంచ్ వావిలపల్లి ప్రభావతి, ఎంపిడిఒ రవీంద్రబాబు, తహశీల్దార్ రమణారావు పాల్గొన్నారు. అంతకుముందు లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు.

కేశవదాసుపురంలో గడపగడపకు...

పొందూరు: మండలం కేశవదాసుపురంలో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్దిని చదివి వినిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ మొకర శంకరరావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, ఉప సర్పంచ్ లింగాల చిరంజీవి, స్థానిక నాయకులు ఎచ్చెర్ల రాజు, మొకర జనార్ధన, చింతపల్లి వెంకటరమణ, గాడు రాజారావు, గాడు రాము పాల్గొన్నారు.

బూర్జ : ఆర్‌బికెని ప్రారంభిస్తున్న సీతారాం, విక్రాంత్

రేపు ఫీల్డ్ అసిస్టెంట్ల ధర్నా

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఉపాధిహామీ క్షేత్ర సహాయకులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, పనిదినాల టార్గెట్ విధానం రద్దు చేసి ఫీల్డ్ అసిస్టెంట్లు అందరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, మున్సిపాలిటీ పరిధిలో విలినమైన గ్రామ పంచాయతీలకు యథావిధిగా ఉపాధిహామీ పథకం అమలు చేయాలని, 3 సంవత్సరాలు పూర్తిచేసిన క్షేత్ర సహాయకులందరికీ ఎఫ్‌టిఇ అమలు చేయాలని, క్షేత్ర సహాయకులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలని తదితర డిమాండ్ల సాధనకు రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ధర్నాకు వెళుతున్నట్లు మండల ఫీల్డ్ అసిస్టెంట్లు శనివారం స్థానిక మండల అభివద్ధి అధికారి కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందించారు. ఫీల్డ్‌అసిస్టెంట్ల రాష్ట్ర (సిఐటియు అనుబంధ సంస్థ) యూనియన్ ఇచ్చిన పిలుపులో భాగంగా డిశంబర్ 18న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని, అలాగే 2024 జనవరి 5న ఛలో విజయవాడ కార్యక్రమానికి మండలంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లందరూ వెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకుల సంఘ అధ్యక్షుడు తామాడ భాస్కరరావు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

'మై భారత్' పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

ఎన్‌వైకె జిల్లా కో-ఆర్డినేటర్ కె.వెంకట్‌ఉజ్వల్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్ర సంగటన్ ఆదేశాలు మేరకు mybharat.gov.in వెబ్ సైట్ లో 15-29 మధ్య వయస్సు గల యువత తమ పేర్లను నమోదు చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం కోగీఆర్డినేటర్ కె.వెంకట్ ఉజ్వల్ కోరారు. దీనికి సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను శనివారం విడుదల చేశారు. యువత తమ వ్యక్తిగత మొబైల్ నంబరు రిజిస్టర్ చేసుకుని ఓటిపి నిర్ధారణ తర్వాత తమ పేరు, పుట్టిన తేది, రాష్ట్రం, జిల్లా, రూరల్/అర్బన్, మున్సిపాలిటీలో ఉన్నవారు అర్బన్, పంచాయతీల్లో ఉన్నవారు రూరల్, మండల కేంద్రం, పిన్ కోడ్ సమాచారం పొందుపరచి చివరిగా ఎన్‌వైకెఎస్‌ను ఎంచుకొని ప్రాథమికంగా నమోదు చేసుకోవాలన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, ఇతర సమాచారం నేరుగా యువత తెలుసుకునేందుకు మై భారత్ పోర్టల్‌ను వినియోగించాలన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఇందిరానగర్ కాలనీలో ఉన్న ఖ్యాతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పళ్లు శనివారం పంపిణీ చేశారు. నిర్వాహకులు డాక్టర్ ఆర్.శ్రావణి, గౌరవ అతిథులుగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, కొంక్యాన గోవిందరాజులు ట్రస్టు అధ్యక్షులు కొంక్యాన మురళీధర్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోత తిరుమలరావులు పాల్గొన్నారు. తిరుమలరావు మాట్లాడుతూ సేవ చేయాలన్న సంకల్పం గొప్పదన్నారు. కార్యక్రమంలో జిల్ ఫౌండేషన్ జాడ సాయి, మదర్స్ హెల్పింగ్ సొసైటీ డాక్టర్ పైడి ప్రదీప్, ఉర్లాం శివతేజ, జెసిఐ గ్రీన్ సిటీ అధ్యక్షులు మణిశర్మ పాల్గొన్నారు.

సమగ్రశిక్ష అభియాన్ సిబ్బంది పెన్‌డౌన్

నౌపడ : ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండల మానవ వనరుల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సిబ్బంది న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శనివారం ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సిఆర్‌ఎంటిలు, ఎంఐఎస్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, పిటిఐలు, ఐఇఆర్‌టి ఉద్యోగులకు ఎంటిఎస్, పిఆర్‌సి ప్రకారం జీతాలు పెంపుదల చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతినెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని, ఉద్యోగాలను రెగ్యులరైజేషన్ చేసి తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 16 నుంచి పెన్‌డౌన్ చేస్తూ పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

పలాస: జీతభత్యాలను పెంపుదల చేయాలని, వేతన బకాయిలను విడుదల చేయాలని ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ పోతనపల్లి బాలరాజు డిమాండ్ చేశారు. పలాస మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ సిహెచ్ శ్రీనివాసరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. అనంతరం సర్వశిక్షా సమగ్ర శిక్ష ఉద్యోగులు పెను డౌన్ చేశారు. కార్యక్రమంలో అప్పలరాజు, శంకర్, ఉష, సునీల్, కేశవ, దుర్యోధన, శేషగిరి, శివ పాల్గొన్నారు.

ఆమదాలవలస : సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఎంఆర్‌సి కార్యాలయం ఎదుట సమగ్రశిక్ష ఉద్యోగులు ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎం.వి.రమణ, శ్రీను, శైలజ, జ్యోతి, చంద్రకళ, ధనలక్ష్మి, శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై సమీక్ష

ప్రజాశక్తి- బూర్జ

రైతులు నుంచి ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు ప్రారంభించాలని తహశీల్దార్ ఎస్.రమణారావు మిల్లర్ల యజమానులకు ఆదేశించారు. శనివారం మండలంలో డొంకలపర్త గ్రామంలో స్వామి అయ్యప్ప రైస్‌మిల్లును పరిశీలించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఎటువంటి అభ్యంతరాలు చూపించకుండా కొనుగోలు చేయాలన్నారు. రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవన్నారు. అలాగే రైతులకు సకాలంలో బిల్లును చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రామారావు, విఆర్‌ఒల జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు పాల్గొన్నారు

పలాస: గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి వారి నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ ఎఒ పోలారావు రైతుభరోసా కేంద్రాల సిబ్బందికి సూచించారు. పలాస వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం వ్యవసాయశాఖ అసిస్టెంట్లు, రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సమయంలో నిబంధనలు పాటించాలన్నారు. ధాన్యం తేమ, ధాన్యాన్ని మిల్లర్లుకు తరలించేందుకు ట్రాక్టర్ ట్యాగ్ చేసి కొనుగోలు చేసిన ఆరు గంటల సమయంలో మిల్లర్లుకు ధాన్యాన్ని చేరవేయాలన్నారు.

పలాస : సమావేశంలో మాట్లాడుతున్న పోలారావు

ప్రభుత్వ కార్యాలయాల్లో చోరీలు

ప్రజాశక్తి- బూర్జ

బూర్జ మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల్లో తరచూ చోరీల సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అన్ని స్థాయిల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఆటలపోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తుంది. దీనికి సంబంధించి ఆటలకు సంబంధించి కిట్లును మండల పరిషత్ కార్యాలయాలకు చేరుకున్నాయి. అయితే ఇందులో ఆరుకిట్లు ఎంపిడిఒ కార్యాలయం నుంచి మాయమైనట్లు తెలుస్తుంది. గతంలో కూడా ఇదే కార్యాలయంలో కంప్యూటర్లు చోరీ జరిగిన సంఘటన కూడా చోటు చేసుకుంది. అంతే కాకుండా తహశీల్దార్ కార్యాలయంలో గత రెండు నెలల క్రితం ల్యాప్‌టాప్‌లు దొంగతనానికి గురైన విషయం తెలిసిందే. పోలీస్ స్టేషన్ పక్క పక్కనే ఉన్న ఈ ప్రభుత్వ కార్యాలయాల్లో తరచూ దొంగతనాలు జరుగుతున్నప్పటికీ పోలీస్‌శాఖ చోద్యం చూస్తుందని స్థానికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు రక్షణ కరువైతే సామాన్య ప్రజలకు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవచూపి దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

లావేరు : మాట్లాడుతున్న గిరిధర్

ఉద్యమ స్ఫూర్తి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి- పలాస

ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతి చెందడం ఉపాధ్యాయ ఉద్యమానికి తీరనిలోటని సమగ్ర శిక్ష యంఐఎస్ కో-ఆర్డినేటర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సంఘం వ్యవస్థాపకుడు పి.బాలరాజు అన్నారు. కాశీబుగ్గ విద్యాశాఖాధికారి కార్యాలయంలో శనివారం ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ సంఘాన్ని అగ్రపథంలో నడిపి, ఉపాధ్యాయ లోకంలో ఆశాదీపంగా వెలిగిన వ్యక్తి సాబ్జి అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.మురళీ కృష్ణ, ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎస్.గౌరీ శంకర్ పాల్గొన్నారు.

లావేరు: ఉపాధ్యాయ నాయకులు, ఎమ్మెల్సీ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని యుటిఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ అన్నారు. మండలంలో అదపాక జెడ్‌పి పాఠశాలలో హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంతాపాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.బాలకృష్ణ, ఎన్.కృష్ణారావు, పి.లక్ష్మణరావు, ఉదయకుమార్, మురళి, వాసుదేవరావు, రుద్రప్రతాప్, ఎన్‌వి రమణ, రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగాం: నిన్న జరిగిన ఘోరరోడ్డుప్రమాదంలో ప్రణాలు కోల్పోయిన ఉద్యమ నేత పిడిఎఫ్. ఎమ్మెల్సీ, యుటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు షేక్ సాబ్జీకి నందిగాం యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్షులు కె.కుమారస్వామి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వై.గణపతిరావు, విశ్రాంతి ఉపాధ్యాయులు, సీనియర్ యుటిఎఫ్ నాయకులు వజ్జ సింహాచలం, మండల గౌరవాధ్యక్షులు జె.చంద్రశేఖరరావు, జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు, కార్యవర్గసభ్యులు అప్పలస్వామి, సురేష్, ధర్మారావు, రమేష్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ఎమ్మెల్సీ షేక్‌సాబ్జీ మృతికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ ఆధ్వర్యంలో శనివారం ఐసిడిఎస్ కార్యాలయ అవరణలో జనసేన నాయకులతో కలిసి అంగన్వాడీలు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, దుంపల సుదర్శన, టిడిపి నాయకులు తర్ర రామకృష్ణ, వెలమల కామేశ్వరరావు, పూజారి శైలజ, బెండి అన్నపూర్ణ, దేవాది సింహాద్రి, ఎస్.శ్రీనివాస్, కర్రి అప్పారావు, గొండు లక్ష్మణరావు, పట్ట సింహాచలం, జనసేన నాయకులు, అంగన్వాడీ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట: యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ సంతాప సమావేశం నిర్వహించారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు, మండల శాఖ అధ్యక్షులు కూర్మారావు, ప్రధాన కార్యదర్శి దొరబాబు, జానకి రామయ్య, కాళిదాసు, లక్కోజి రవికుమార్, జి.ప్రకాష్, సుశీల, హేమచంద్ర, శ్రీనివాసరావు, తేజ మూర్తి పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సంతోష్

పారిశుధ్య కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 21 నుంచి సమ్మెకు వెళ్లనున్నట్లు కార్మిక సంఘ నాయకుడు తాడి సంతోష్ తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్‌ను శనివారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. సమాన పనికి సమాన వేతనం, ఇఎస్‌ఐ, పిఎఫ్ సక్రమంగా అమలయ్యేలా చూడాలని, పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు పెన్షనర్ల సమావేశం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

అఖిల భారత పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా ఆదివారం టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల పెన్షనర్ల సంక్షేమ సంఘ సమావేశం టెక్కలిలో జరుగుతుందని సంఘ అధ్యక్షుడు రోణంకి రామచంద్రరావు, కోశాధికారి బొడ్డ అయ్యబాబు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రోణంకి అప్పలస్వామివీధి సమీపంలోని సంఘ భవనంలో అదే రోజు దంత, హోమియో, కంటి వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు.

పెన్షన్ జమ చేయరూ...

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

జిల్లా గ్రంథాలయ సంస్థలో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ఇంతవరకు పెన్షన్ చెల్లించకపోవడంతో ఆ కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయని, ప్రభుత్వం తక్షణమే పెన్షన్ చెల్లించాలని ఎపిటిఎఫ్ మండలశాఖ గౌరవ అధ్యక్షులు గున్న ప్రసాదరావు డిమాండ్ చేస్తూ ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా జీతాలకు, పెన్షన్‌ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చిందని, ఇకనైనా 1వ తేదీనే జీతాలు, పెన్షన్‌లు చెల్లించాలని డిమాండ్ చేశారు.

రేపు ఎంపీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు 36వ జన్మదిన వేడుకలు ఈ నెల 18న నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి టిడిపి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజాసదన్‌లో టిడిపి నాయకులు, ఆయన అభిమానులతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 8 నుంచి వివిధ వేడుకల నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు,రొట్టెలు పంపిణీ చేపట్టనున్నట్టు వివరించారు. సమావేశంలో టిడిపి నాయకులు చౌదరి నారాయణమూర్తి, బోయిన గోవిందరాజులు, చిట్టి మోహన్, కొర్ను ప్రతాప్ పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగ కార్యదర్శిగా కృష్ణ

ప్రజాశక్తి- సోంపేట

కృష్ణ

జిల్లా వైసిపి యువజన విభాగం జనరల్ సెక్రటరీగా లక్కవరం గ్రామానికి చెందిన వి.కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి నియామకపత్రాలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ పదవి తనకు రావడంలో సహకరించిన జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియ విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్, ఎంపిపి డాక్టర్ ఎన్ దాసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కృష్ణను సెక్రటరీగా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

20 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి- కవిటి

మండలం డిజి పుట్టుగ గ్రామంలో రాబోయే సంక్రాంతి సందర్భంగా జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు శ్రీ ప్రతిభ యువజన సంఘ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆసక్తి ఉన్న జట్టు డిసెంబర్ 20 నుంచి జనవరి 1లోగా తమ జట్టు వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.20 వేలుతో పాటు ట్రోఫీ, ద్వితీయ బహుమతి రూ.12 వేలు, ట్రోఫీ అందిస్తున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 7093109849, 9014887374 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

రక్తదాతలకు గుర్తింపు పత్రాలను అందజేస్తున్న ప్రతినిధులు

రక్తదానంతో ప్రాణదానం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రక్తదానం ప్రాణదానంతో సమానమని అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధి కమలాకర రెడ్డి అన్నారు. మండలంలోని పారిశ్రామిక వాడ పైడిభీమవరంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఎపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్, యూనిట్-4 ఉద్యోగులు, కార్మికులు 200 మంది రక్తదానం చేసారు. ఈ సేవా కార్యక్రమం ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్ - రక్త నిధులు కేంద్రం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. అనంతరం వీరికి గుర్తింపు పత్రాలను అందించారు.

విఆర్‌ఒలతో సమీక్ష

ప్రజాశక్తి- జి.సిగడాం

మండల కేంద్రంలో తహశీల్దార్ పప్పల వేణుగోపాలరావు ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ అసైన్మెంట్ ల్యాండ్స్ ఉంటే వాటి పట్టాదారులకు అందించాలన్నారు. గ్రామంలో రీసర్వే ముందురోజు గ్రామపెద్దలు, నాయకుల సమక్షంలో గ్రామసభ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న దృష్ట్యా ఫారం7, 8 క్షుణ్ణంగా పరిశీలించాలని, తుది జాబితాలో ఏమైనా డబల్ ఎంట్రీలు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల రెవెన్యూ అధికారి రామచంద్రరావు, డిటి ఎన్.నిర్మల, మండల అధికారులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నేతాజీ

వ్యాపారులకు యోగ్యతా శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రైతులు సాంకేతిక సలహాలతో పాటు పంటకు వాడాల్సిన రసాయన ఎరువులు, పురుగు మందులు, కలుపు మందుల వినియోగంపై రైతులు నేరుగా ఉత్పాదక డీలర్లనే సంప్రదిస్తున్నారని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డాక్టరు నేతాజీ పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ వనరుల కేంద్రంలో వ్యవసాయవిస్తరణ సేవలకు ఉత్పాదక వర్తకులకు సేవా యోగ్యత శిక్షణా తరగతులను శనివారం నిర్వహించారు. ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొని మాట్లాడుతూ రైతు రుణం తీర్చలేనిదని, వారికి అంకితభావంతో సేవ చేయాలని సూచించారు. రాగోలు వరి పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి కె.శ్రీధర్‌లు మాట్లాడుతూ తొలి దశల్లోనే ఎక్కువ విషపూరితమైన రసాయనాలు వాడకుండా గ్రీన్ లేబుల్ ఉన్న రసాయనాల్ని సూచించాలని అన్నారు. అవసరం లేకపోయినా ఒకదానికి ఇంకొక రసాయనాన్ని అదనంగా సిఫార్స్ చేయొద్దని సూచించారు. అధిక రసాయనాలు వాడడంతో కేన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డిడిఎ కె.కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆత్మా పీడీ డాక్టర్ ఎ.రామచంద్రరావు, కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సునీత, డాక్టర్ బి.మౌనిక, ఫెసిలిటేటర్ బాలకృష్ణ, పి.రేవతి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరావు, ప్రవీణ

కిడ్నీ ఆస్పత్రిపై మాట్లాడే అర్హత లేదు

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభం చేసిన కిడ్నీ ఆస్పత్రి, సుజల స్రవంతి పథకాలపై టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావుకి మాట్లాడే అర్హత లేదని పలాస ఎంపిపి ఉంగ ప్రవీణ, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి అన్నారు. మండలం ఉద్దాన ప్రాంతంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ రెండు రూపాయలకు శుద్ధ జలాన్ని అమ్ముకొనే చరిత్ర టిడిపిదని విమర్శించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఏమి చేశారో చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. నాలుగేళ్లకే శంకుస్థాపన చేసి ప్రారంభించిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనన్నారు. సమావేశంలో జెడ్‌పిటిసి ప్రతినిధి మచ్చ ధనరాజ్, దువ్వాడ రవి, అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, చింతాడ మాధవరావు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు సంతోష్, బొడ్డపాడు సర్పంచ్ మదన్, సూర్య, షణ్ముఖరావు, మోహన్, రామ్ నరేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

బహిరంగ చర్చకు సిద్ధమా?

ఆమదాలవలస: జిల్లాలో గడచిన 25 సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు కూన రవికుమార్ సిద్ధమా అని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ సవాల్ విసిరారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ రవికుమార్ కళ్లు ఉన్నా చూడలేని గుడ్డివాడని, సిఎం జగన్మోహన్ రెడ్డి ఉద్దానం ప్రాంతంలో ఉపరితల తాగునీరు సౌకర్యం కల్పించడాన్ని చూడలేక లేనిపోని మాటలు మాట్లాడుతున్నారన్నారు. దశాబ్దాలుగా కిడ్నీ వ్యాధితో అసువులు బాసారని ఆ సమస్యకు శాశ్వత పరిష్కార 200 పడకల కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రిని నిర్మించారని తెలిపారు. అధికారం చేపట్టిన వెంటనే కిడ్నీ బాధితులకు నెలకు పదివేల పింఛను అందజేసిన సంగతి రవికుమార్ కంటికి కనబడలేదా అని ప్రశ్నించారు. జిల్లాకు టిడిపి చేసిందేమీ లేకపోవడంతో జగన్మోహన్ రెడ్డిపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. కారక్రమంలో వైసిపి నాయకులు దానేటి రామ్మోహన్, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, సువ్వారి మనోహర్ పాల్గొన్నారు.

కళ్లద్దాలు పంపిణీ

సోంపేట: స్థానిక రోటరీ హాల్లో శనివారం 500 మంది రోగులకు ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ ప్రతినిధులు మాట్లాడుతూ ఇటీవల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా గుర్తించిన 500 మంది రోగులకు కళ్లద్దాలను పంపిణీ చేశామన్నారు. భవిష్యత్తులో సైతం రోటరీ క్లబ్‌ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు పివి కృష్ణారావు, కె రవికుమార్, వై.మోహనరావు, వెంకటరమణ, రమేష్, ఎం.జగన్ మోహనరావు, ఎస్.గణేష్ పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి- కొత్తూరు

వంశధార నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న నిధులు మంజూరు చేసినందుకు వైసిపి జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు ఆధ్వర్యంలో శనివారం మెట్టూరు బిట్-2 గ్రామలైన మెట్టూరు బిట్-1, మెట్టూరు బిట్-2, మెట్టూరు బిట్-3, గూనభద్ర, గూనభద్ర ఆర్‌ఆర్ తదితర నిర్వాసిత గ్రామాల నిర్వాసిత నాయకులు, మహిళలు, సిఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టిడిపి ప్రభుత్వం నిర్వాసితులకు ఎంతో అన్యాయం చేసినప్పటికీ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వాసితులకు అండగా ఉంటూ ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితులను మోసం చేసిన టిడిపి ప్రభుత్వమని, చలికాలంలో కూడా గ్రామాలు ఖాళీ చేయించారని ఆయన అన్నారు. కార్యక్రమంలో వంశధార నిర్వాసిత నాయకులు కొయిలాపు సంజీవరావు, పెదకోట సంజీవ రావు, పెదకోట శ్రీరాములు, బర్రి రాజారావు, గవర ఉమా మాస్టారు, బుడ్డ రామకృష్ణ, బూడిద శాంతారావు, చంద్రరావు, బర్రి వెంకట్రావు, గొర్లి రామినాయుడు, చందర్రావు, బూడిద బంగారి, అశోక్, ధర్మాన చంటి పాల్గొన్నారు.

వంశధార నిర్వాసితులకు పెండింగ్ నిధులు సిఎం జగన్మోహన్ రెడ్డిచే మంజూరు చేసినందుకు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతిని గూనభద్ర ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్వాసితులు దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. అలాగే మెట్టూరులో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సిఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు సూర్యనారాయణ, సర్పంచ్‌లు పేదకోట సాధుబాబు, వై.ధర్మారావు, కె.వైకుంటారావు, గజేంద్ర, జి.ఆనందరావు, ఎల్.తిరుపతిరావు, బి.శ్రీను, పంకాజ్ దాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నిర్వాసితులు

శిలాఫలకాల ధ్వంసం

ధ్వంసం చేసిన శిలాఫలకాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో కట్యాచార్యులపేట గ్రామపంచాయతీ పరిధిలో హనుమంతపురం గ్రామ రహదారి నిర్మాణానికి వేసిన శిలాఫలకాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన సంఘటన చోటుచేసుకుంది. కొర్లకోట, చీమలవలస బిటి రహదారి నుంచి హనుమంతపురం గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణానికి గతంలో టిడిపి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అప్పటి ప్రభుత్వ విప్ కూన రవికుమార్ శంకుస్థాపన చేశారు. అయితే అప్పట్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్; 2019 శాసనసభ ఎన్నికలు కోడ్ రావడంతో ఈ రహదారి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక శాసనసభ్యుడు తమ్మినేని సీతారాం హనుమంతపురం రహదారి నిర్మాణానికి రూ.70 లక్షలతో నిర్మాణ పనులు చేపట్టడానికి శంకుస్థాపన చేసి శిలాఫలకం ఏర్పాటు చేశారు. రెండు శంకుస్థాపనలు జరిగినప్పటికీ మరికొద్ది రోజుల్లో సాధారణ ఎన్నికలు వస్తున్నప్పటికి నేటికి రహదారి నిర్మాణం జరగకపోవడంతో ఇటీవల ఆ గ్రామంలో జలజీవన్ మిషన్ పనుల శంకుస్థాపన సమయంలో గ్రామంలో కొందరు యువకులు శాసనసభ్యుడిని రహదారి సమస్యపై ప్రశ్నించగా త్వరలోనే రహదారి నిర్మాణం పూర్తి చేస్తానని చెప్పి వెనుదిరిగారు. తమ గ్రామరహదారి నిర్మాణం చేపట్టకపోవడం పట్ల నిరసనతో ఈ రెండు శిలాపలకాలను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఎస్‌ఐ వై. కృష్ణను వివరణ కోరగా తమకు శిలాఫలకాల ధ్వంసంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

జనవరిలో వైఎస్‌ఆర్ ఆసరా

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన మాటకు కట్టుబడి, అమలు చేస్తున్న సంక్షేమ, మహిళాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా వైఎస్‌ఆర్ ఆసరా 4వ విడత నిధులను మహిళా సంఘాలకు జనవరి నెలలో నేరుగా ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేయబోతున్నట్లు వైఎస్‌ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శనివారం మండల పరిధిలో నెల్లిపర్తి గ్రామ సంఘం మహిళలకు ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో మాట్లాడారు. మండల పరిధిలో 934 స్వయంశక్తి సంఘాలకు రూ.26 కోట్ల 72 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి మానకొండ ధనలక్ష్మి, సర్పంచ్ మానకొండ రాజేశ్వరి, క్లస్టర్ కో-ఆర్డినేటర్ సుభద్ర, విఒఎ భారతితో పాటు స్వయం శక్తి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ వద్ద ఆటోలకు అవకాశం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద ఆటోలు నిలుపుకునేందుకు స్థలం కేటాయింపు చేయాలని ఆటో యూనియన్ నాయకులు రైల్వేస్టేషన్ మాష్టర్ రావుకు వినతిపత్రం సమర్పించారు. పట్టణానికి కొద్ది దూరంలో ఉన్న ఇచ్ఛాపురంకు ప్రయాణికులు రైలు దిగి ఇంటికి వెళ్లేందుకు ఆటోలు అవసరం ఏర్పడుతుందన్నారు. నిత్యం దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని తమ ఆటోలు నిలుపుకునేందుకు స్టేషన్ అవరణలో అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఉలాసి ఎర్రయ్య, చంటి మాధవరావు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌కు రూ.10వేలు వితరణ

కోటబొమ్మాళి: మండల కేంద్రంలో టిడిపి కార్యాలయ అవరణలో పేదలకోసం ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌కు మండలం మరువాడ సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, జిల్లా తెలుగు యువత కార్యదర్శి దాసురాజు కుమార్తె సంధ్య పుట్టిన రోజు సందర్భంగా శనివారం రూ.10వేలును వితరణగా అందజేశారు. మొత్తాన్ని అన్నాక్యాంటీన్ నిర్వాహకులు లాడి శ్రీనివాస్‌కు అందజేశారు. మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, టిడిపి నాయకులు వెలమల కామేశ్వరరావు, కోరాడ పెద్దగోవింద, గోవిందరావు, లక్ష్మణరావు ఉన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి- పొందూరు

మండలం గోరింటలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని సర్పంచ్ చింతాడ కృష్ణవాసుదేవరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో టిడిపి గెలిస్తే అందించనున్న సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి గాడు నారాయణరావు, సీపాన శ్రీరంగనాయకులు, సీపాన భాస్కరరావు, బాడాన శేషగిరినాయుడు, చౌదరి వరదరాజులు, ఉప సర్పంచ్ కూన నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఆమదాలవలస : మాజీ సిఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని టిడిపి జిల్లా కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు అన్నారు. మండలంలో బొబ్బిలిపేటలో గొల్లవీధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి గ్యారెంటీ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గొండు రమణ, బొడ్డేపల్లి గౌరీపతిరావు, టిడిపి నాయకులు వడ్డాది గురుమూర్తి, సీపాన హరీష్ పాల్గొన్నారు.

పొందూరు : పోస్టర్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

జగన్‌తోనే సంక్షేమం

ప్రజాశక్తి - కవిటి

రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అవినీతి రహితంగా సంక్షేమ పథకాల అమలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, రాష్ట్రంలో ప్రతి మహిళకు ప్రత్యేక గుర్తింపు ప్రస్తుత ప్రభుత్వంలోనే సాధ్యమైందని, అందుకే మళ్లీ జగనే అధికారంలోకి రావాలని వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్త పిరియా సాయిరాజ్, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. మండలం కపాసుకుద్ది గ్రామంలో జగనే ఎందుకు రావాలి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించి పంచాయతీలో అందించిన సంక్షేమ పథకాల చార్ట్ విడుదల చేశారు. అనంతరం వైసిపి ప్రభుత్వం విధి విధానాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, పూర్తిస్థాయిలో అమలు జరిపిన మేనిఫెస్టో వివరాలు ఓటర్లుకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాయ దమయంతి, ఎఎంసి వైస్ చైర్మన్ నీలయ్య, కో- ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎంపిటిసిలు పూడి నీలాచలం, తడక పార్వతి, యువనేత నర్తు శివాజీ, వైసిపి లీగల్ సెల్ కన్వీనర్ పులకల శ్రీరాములు, జల్లు యుగంధర్, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, వైసిపి నాయకులు, సచివాలయం కన్వీనర్లు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ఛార్ట్ విడుదల చేస్తున్న సాయిరాజ్, ప్రకాష్

పెరటికోళ్ల పెంపకంతో జీవనోపాధి

కోళ్లను పంపిణీ చేస్తున్న ఎంపిపి ప్రతినిధి ఉదయ్‌కుమార్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పెరటికోళ్ల పెంపకంతో పలువురికి జీవనోపాధి లభిస్తుందని మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ అన్నారు. శనివారం వెలుగు కార్యాలయ ఆవరణలో వైఎస్ఆర్ పెరటికోళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై లబ్ధిదారులకు పెరటికోళ్లు అందిస్తుందన్నారు. నాటుకోళ్లకు మంచి గిరాకీ ఉందన్నారు. పెరటికోళ్ల పెంపకాన్ని లాభసాటిగా మార్చుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఒక్కో యూనిట్ రూ.3,970కాగా మూడు పుంజులు, ఎనిమిది పెట్టలతో పాటు మందులు, దాణాను 50 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపిఎం జాంబవతి, మండల మహిళా సమైక్య అధ్యక్షులు ఉషారాణి, ఎంపిటిసి ప్రతినిధి బి.మోహనరావు, ఇఒపిఆర్‌డి తిరుమలరావు, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న టిడిపి నాయకులు

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- లావేరు

మండలంలో గుమ్మడాం గ్రామానికి చెందిన గంధవరపు సూరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న టిడిపి నాయకుడు మజ్జి రామూర్తి ఆ కుటుంబాన్ని శనివారం పరామర్శించి తన సంతాపాన్ని తెలిపారు. అనంతరం ఆ కుటుంబాన్ని ఆదుకునే విధంగా రూ. రెండువేల ఐదు వందలు నగదు, బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దుర్గశి కోటేశ్వరరావు, ముప్పిడి వెంకటప్పుడు, వి.సంతోష్ కుమార్, అప్పలనాయుడు, వినోద్ కుమార్, నాగం వెంకటరావు, సుత్తి సంతోష్ కుమార్, ముప్పిడి సంతోష్ ఉన్నారు.

కళింగాంధ్ర యూత్ అధ్యక్షునిగా రామకృష్ణ

రామకృష్ణ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో సామాజిక సేవల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన కళింగాంధ్ర యూత్ అసోసియేషన్‌కు నూతన అధ్యక్షునిగా సనపల రామకృష్ణ ఎన్నికయ్యారు. అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికల ప్రక్రియ శనివారం జరిగింది. ఈ ఎన్నికల్లో నూతన అధ్యక్షులుగా ఆముదాలవలస మండలం చీమలవలసకు చెందిన రామకృష్ణ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వ్యవస్థాపక అధ్యక్షులు పైడి నవీన్ తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కొత్తకోట శ్రీహరి, ఎన్‌ఆర్‌ఐ వింగ్ అధ్యక్షులుగా పేడాడ అమర్ దీప్, ఉపాధ్యక్షులుగా సిహెచ్.సత్యనారాయణ, కోశాధికారిగా కూన శ్రావణ్, మీడియా కన్వీనర్‌గా సీపాన రమేష్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

లోకేష్‌ను కలిసిన భాస్కరరావు

ప్రజాశక్తి- లావేరు

లోకేష్‌తో భాస్కరరావు

మాజీమంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను లావేరు మండలం గోవిందపురం పంచాయతీకి చెందిన టిడిపి నాయకుడు యినపకుర్తి భాస్కరరావు శనివారం అనకాపల్లి జిల్లాలో యువగళం పాదయాత్ర చేస్తున్న లోకేష్‌ను కలిసి సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా రానున్నది టిడిపి ప్రభుత్వమేనని, యువత రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలని దిశా నిర్దేశం లోకేష్ చేసినట్లు భాస్కరరావు తెలిపారు.

దానేటి శ్రీధర్‌కు టైమ్స్ అవార్డు

అవార్డును స్వీకరిస్తున్న శ్రీధర్

శ్రీకాకుళం అర్బన్ : వైద్య రంగంలో విశేష సేవలందిస్తున్న డాక్టర్ దానేటి శ్రీధర్‌కు టైమ్స్ హెల్త్ ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. శనివారం హైదరాబాద్‌లోని పార్కు హ్యాట్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రముఖ బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ చేతుల మీదుగా అందజేశారు. ఐకాన్ ఇన్ ఐవిఎఫ్ ట్రీట్మెంట్ ఇన్ రూరల్ ఏరియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్-2023 సంబంధించి ఈ అవార్డు దక్కింది.

జనసేనలోకి 'కోత'

పవన్ కళ్యాణ్‌తో కోత

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు శనివారం మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా పలాస నియోజకవర్గంలో పోటీ చేసిన కోత అనంతరం 2020లో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో వైసిపిలో చేరారు. మూడేళ్లుగా పార్టీలో సముచిత స్థానం కల్పించకపోవడంతో ఆ పార్టీకి దూరమయ్యారు. లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర సందర్భంగా శనివారం పార్టీ నాయకులు విజయకుమార్ ఆధ్వర్యంలో మొరపాక వద్ద పాదయాత్రలో పాల్గొన్నారు.

బిసి సెల్ ప్రధాన కార్యదర్శిగా ఢిల్లీ

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్, ప్రస్తుత 14వ వార్డ్ కౌన్సిలర్ ప్రతినిధి నీలాపు ఢిల్లీకు జిల్లా బిసి సెల్ జనరల్ సెక్రెటరీగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, సమన్వయకర్త సాయి రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.